స్వయంభూ నారసింహస్వామికి నిత్యారాధనలు

తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 29 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంతో స్వయంభూ నారసింహ స్వామికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. మంగళవారం తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు తిరువారాధన నిర్వహించి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ సుదర్శన నారసింహ హోమం జరిపారు. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి గజవాహన సేవ ఊరేగించి కల్యాణోత్సవ సేవను నిర్వహించారు. వెలుపలి ప్రాకార మండపంలో తూర్పునకు అభిష్టంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి నిత్య తిరు కల్యాణోత్సవం జరిపారు. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు వెండి మొక్కు జోడు సేవ, దర్బార్ సేవను ఘనంగా చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. రాత్రి స్వామి, అమ్మవార్ల శయనోత్సవ సేవ వైభవంగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. ప్రధానాలయం, క్యూ కాంప్లెక్స్, శివాలయంలో చెంతనగల క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామికి ఆకుపూజను ఘనంగా నిర్వహించారు. హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. తమలపాకులతో అర్చించి లలితాపారాయణం చేశారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన వడపప్పు. బెల్లం, అరటి పండ్లను నైవేద్యంగా సమర్పించారు. సుమారు 8వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ.11,75,148 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వామివారి సేవలో కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి సేవలో కలెక్టర్ ఎం.హనుమంతరావు పాల్గొని తరించారు. జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా స్వయంభూ పంచనారసింహ స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సంప్రదాయరీతిలో స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు, వేద పండితులు వేదాశీర్వచనం చేయగా.. ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ స్వామివారి ప్రసాదం అందజేశారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- సంక్షేమ పథకాలు అట్టడుగు వర్గాలకు చేరేలా చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ హనుమంతరావు

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 29 : ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అట్టడుగు ప్రజలకు చేరేలా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నిలుపాలన్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడుతామని తెలిపారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం వివిధ శాఖల అధికారులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సమగ్ర సర్వేను పక్కాగా నిర్వహించాలి

సమగ్ర ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మధిర తాసీల్దార్ కార్యాలయం నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై సీఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో, ఇంటింటి సర్వే ఏర్పాట్లపై మాస్టర్ ట్రైనర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. సర్వేకు వెళ్లే ఎన్యుమరేటర్లకు ఐడీ కార్డులు జారీ చేస్తామన్నారు. మండల స్థాయిలో ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించే తుది ఫార్మాట్‌కు అనుగుణంగా సర్వేలో వివరాలను సేకరించాలన్నా రు. సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాల సర్వేకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నవంబర్‌లో జరుగనున్న సమగ్ర సర్వేకు మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాట్లను పర్యవేక్షించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. డిజిటలైజేషన్ కోసం డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఏర్పాటు చేయాలన్నారు. సర్వే నిర్వహణ కోసం అత్యుత్తమ ఎన్యుమరేటర్లను ఎంపిక చేయాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఈ సర్వే అన్ని ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తుందని, ఎటువంటి తప్పులు లేకుండా త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జడ్పీ సీఈఓ శోభారాణి, డీపీఓ సునంద, ఆర్డీఓలు శేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జగన్మోహన్‌ప్రసాద్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పోరాటంతోనే విద్యుత్ చార్జీల పెంపుపై వెనక్కి..

మోత్కూరులో సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

మోత్కూరు, అక్టోబర్ 29 : విద్యుత్ చార్జీల పెంపు విషయమై ప్రభుత్వం వెనక్కి తగ్గడంతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పటాకులు కాల్చారు. అనంతరం మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.18,500 కోట్ల అదనపు భారాన్ని మోపేందుకు ప్రయత్నించిందన్నారు. బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో ఏనాడూ విద్యుత్ చార్జీలను పెంచలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలు చేస్తే ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ వ్యతిరేకించిందని, పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని ఈఆర్‌సీని ఒప్పించగలిగామని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కొణతం యాకూబ్ రెడ్డి, మర్రి అనిల్‌కుమార్, మంచె గోవర్ధన్, దబ్బేటి శైలజ, బయ్యని పిచ్చయ్య, సామ పద్మారెడ్డి, అన్నందాసు విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో డీఏఓ తనిఖీ

రాజాపేటలో ఫర్టిలైజర్ షాపును పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్

రాజాపేట, అక్టోబర్ 29 : మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపును జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. నకిలీ మందులు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట ఏఓ పద్మజ, ఏఈఓలు ప్రణీత, అంజయ్య, కవిత ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

తుర్కపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చైతన్య, పీఏసీఎస్ చైర్మన్ నరసింహారెడ్డి

తుర్కపల్లి, అక్టోబర్ 29 : మండల కేంద్రంతోపాటు వాసాలమర్రి, వీరారెడ్డిపల్లి, గంధమల్ల, ముల్కలపల్లి, పెద్దతండా, పల్లెపహాడ్, చిన్నలక్ష్మాపురం, గోపాల్‌పురం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్య, పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పట్టు నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కొండ్రా ముత్యాలు, డైరెక్టర్లు మాధవీలత, గిద్దె ఆండాలు, వెంకటేశం, చంద్రమౌళి, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్ యాదవ్, మోహన్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని రహీంఖాన్‌పేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మోత్కూర్ రైతు వ్యవసాయ సేవా సహకార సంఘం చైర్మన్ డి.వెంకటేశ్వర్లు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ వరలక్ష్మి, సహకార సంఘం డైరెక్టర్ స్వామి, సిబ్బంది నరహరి, ఐలయ్య పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండల కేంద్రంతోపాటు హాజీపూర్, మైలారం, నాగినేనిపల్లి, మేడిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖాబాబూరావు ప్రారంభించారు. వైస్ చైర్మన్ బైసు రాజేశ్, పీఏసీఎస్ చైర్మన్ గూదె బాలనర్సయ్య పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : మండలంలోని కొలనుపాకలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ డైరెక్టర్ మోతె మైసయ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దన్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శివకుమార్, నాయకులు గాదె సోమిరెడ్డి, ఒగ్గు శ్రీశైలం పాల్గొన్నారు.

వెంకటాపురం గ్రామ పంచాయతీ రికార్డుల పరిశీలన

వెంకటాపురం గ్రామ పంచాయతీలో విచారణ చేస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారి ప్రతాప్‌నాయక్

వలిగొండ, అక్టోబర్ 29 : మండలంలోని వెంకటాపురం గ్రామ పంచాయతీలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నట్లు గ్రామ మాజీ సర్పంచ్ కొత్త వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాలతో చౌటుప్పల్ డివిజనల్ పంచాయతీ అధికారి ప్రతాప్‌నాయక్ మంగళవారం గ్రామ పంచాయతీలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం చేసి నిధుల దుర్వినియోగం చేశారని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విచారణ చేసి రికార్డులను స్వాధీనం చేసుకున్నామన్నారు. విచారణ వివరాలను ఉన్నతాధికారులకు పంపించి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'మూసీ నది' ప్రాంతాన్ని ప్రత్యేక జోన్‌గా గుర్తించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

వలిగొండ, అక్టోబర్ 29 : మూసీ నది పరీవాహక ప్రాంతాన్ని ప్రత్యేక జోన్‌గా గుర్తించి అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సీపీఎం 8వ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. మూసీ నది కాలుష్య నివారణకు ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని ఎన్ని ఎస్టీపీలను ఏర్పాటు చేస్తుందో ప్రభుత్వం ప్రకటించాలన్నారు. మూసీ నది పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల ఆరోగ్యం, అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మూసీ ప్రాంతాన్ని ప్రత్యేక జోన్‌గా ప్రకటించి కాలుష్యాన్ని నియంత్రించి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మహాసభలో నాయకులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనూరాధ, మాటూరి బాలరాజు, మద్దెల రాజయ్య, సిర్పంగి స్వామి, కూర శ్రీనివాస్, స్వామి, శివ, ముత్యాలు, సురేందర్, శ్రీశైలంరెడ్డి పాల్గొన్నారు.

ఆయుర్వేదంపై అవగాహన సదస్సు

ధన్వంతరి దేవికి పూజలు చేస్తున్న అధ్యాపకులు

ఆలేరు టౌన్, అక్టోబర్ 29 : పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులకు మంగళవారం ఆయుర్వేదంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటమ్మ మాట్లాడుతూ ధన్వంతరి దేవి జయంతిని పురస్కరించుకొని ఆయుర్వేద డేలో భాగంగా ఆయుర్వేదంపై విద్యార్థినులకు అవగాహన కల్పించామన్నారు. పిల్లలతో యోగాసనాలు వేయించి 550 మందికి స్క్రీనింగ్ చేసి 167 మంది పిల్లలకు ఆయుర్వేద మందులు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ల క్యాంపు కో ఆర్డినేటర్ రమాదేవి, జయశ్రీ, అన్వర్ మెహ్మద్, మంజుల, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయి

- మున్సిపల్ చైర్మన్ శంకరయ్య

క్రీడా పోటీలు ప్రారంభించి మాట్లాడుతున్న ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య

ఆలేరు టౌన్, అక్టోబర్ 29 : క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య అన్నారు. పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన మొరిగాడి నర్సయ్య గౌడ్ స్మారక క్రీడోత్సవాలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయుడు నర్సయ్యగౌడ్ తరగతి గదిలో చెప్పిన విద్య విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బెజ్జం బాలకృష్ణ, పూల నాగయ్య, గడసంతల మధుసూదన్, మాదాని జోసెఫ్, రఘువీర్‌సింగ్, స్వామిరాజ్, మధు, మురళి, సంపత్, నిర్మల పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల తనిఖీ

అనంతరం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మున్సిపల్ చైర్మన్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. పేపర్‌లో వచ్చిన వార్తపై ప్రిన్సిపాల్ రాజారామ్‌ను ప్రశ్నించగా.. విద్యార్థులకు సకాలంలో ఉపకార వేతనాలు రాక, విద్యార్థులు సకాలంలో ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఓ విద్యార్థిని ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతుంటే ఆర్థిక సాయం చేస్తే దాన్ని వక్రీకరించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునవృతం కాకుండా చూడాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.

35కిలోల గంజాయి పట్టివేత

- నలుగురి అరెస్ట్

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 29 : కారులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 35కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో మంగళవారం ఆంధ్రా నుంచి వస్తున్న కారును ఆపి పోలీసులు తనిఖీ చేశారు. అందులో 35కిలోల గంజాయి లభ్యమైంది. ఆ కారులో ఉన్న ఇద్దరిని, ముందు కారులో ఎస్కార్ట్‌గా వెళ్తున్న మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కార్లు, 3సెల్ ఫోన్లు, 35కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారిస్తున్నామని, మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

భువనగిరి అర్బన్, అక్టోబర్ 29 : చికిత్స పొందుతూ మహిళ మృతిచెందింది. మోటకొండూర్ మండలం చందెపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ అఫ్జల్‌బీ (65) భువనగిరి పట్టణంలోని అర్బన్ కాలనీలో తన కూతురు ఇంటికి వచ్చింది. ఈ నెల 26న తిరిగి సొంత గ్రామానికి వెళ్లేందుకు భువనగిరి బస్టాండ్‌లోని యాదగిరిగుట్ట నుంచి బస్టాండ్ లోపలికి వెళ్లే మార్గంలో నడుచుకుంటూ పోతుంది. ఈ సమయంలో బస్టాండ్‌లోకి వెళ్తున్న ఆర్టీసీ బస్సు మహిళను వెనుక నుంచి ఢీకొట్టింది. గాయాలైన ఆమెను వెంటనే ఏరియా దవాఖానకు తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు అన్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

నిందితుడి అరెస్టు

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 29 : పట్టణంలో కట్ట మైసమ్మ ఆలయం బొడ్రాయికి బీరు సీసాలు పగులగొట్టిన నిందితుడిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ కంచర్ల భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శివారెడ్డిగూడెం గ్రామానికి చెందిన చిలువేరు కృష్ణకాంత్ కొంత కాలంగా మతిస్థిమితం లేక రోడ్లపై తిరుగుతూ సైకోగా వ్యవహరిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కట్ట మైసమ్మ దేవాలయం బొడ్రాయి వద్ద బీరు సీసాలు పగులగొట్టడం, మున్సిపల్ కార్యాలయంలో కిటికీ అద్దాలు ధ్వంసం చేయడం, అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగులగొట్టి గుడ్లు తినడం చేశాడు. గతంలో అయ్యప్ప దేవాలయం వద్ద కృష్ణకాంత్ రాళ్లు విసరడంతో పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి మద్యం సేవించి ఆకలి కావడంతో వీరంగం సృష్టించాడని ఎస్ఐ తెలిపారు. నిందితుడిని ఎర్రగడ్డ ఆసుపత్రికి తరలిస్తామని ఆయన చెప్పారు.

అదానీ భూముల్లో లాజిస్టిక్ పార్కు నిర్మించాలి : బీఆర్ఎస్

రామన్నపేట, అక్టోబర్ 29 : రామన్నపేట, కొమ్మాయిగూడెం, సిరిపురం రెవెన్యూ గ్రామాల పరిధిలో అదానీ గ్రూప్ కొనుగోలు చేసిన భూముల్లో డ్రైపోర్టు, లాజిస్టిక్ పార్క్‌లు నిర్మించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు కూనూరు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. డ్రైపోర్టు, లాజిస్టిక్ పార్కు ఏర్పాటు చేస్తామని సన్నకారు రైతుల వద్ద సుమారు 400 ఎకరాల భూమిని కొనుగోలు చేశారన్నారు. ఇప్పుడు కాలుష్య కారక అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని ప్రజాభిప్రాయ సేకరణ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు ముక్తకంఠంతో సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకించారని, ప్రజల మనోభావాలను గౌరవించి సిమెంట్ పరిశ్రమను రద్దు చేసుకోవాలని అన్నారు. లేకుంటే నవంబర్ 15న దళిత, బీసీ బడుగు, బలహీన వర్గాల ప్రజలతో కలిసి భూములను సాగులోకి తెస్తామని, నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఏర్పాటు చేయిస్తామని హెచ్చరించారు.

కుర్రారం గౌడ సంఘం అధ్యక్షుడిగా భానుప్రకాశ్‌గౌడ్

భాను ప్రకాశ్‌గౌడ్

రాజాపేట, అక్టోబర్ 29 : మండలంలోని కుర్రారం గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడిగా పాండవుల భానుప్రకాశ్‌గౌడ్‌ను ఆ సంఘం నాయకులు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భానుప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తుల సంక్షేమానికి పాటుపడుతామన్నారు. అనంతరం ఆయనను గ్రామ కుల పెద్దలు సత్కరించారు.

ఆలేరు పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

ఆలేరు పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ రమేశ్‌కుమార్

ఆలేరు టౌన్, అక్టోబర్ 29 : పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను ఏసీపీ పి.రమేశ్‌కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వార్షిక తనిఖీలో భాగంగానే పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను, పోలీసు సిబ్బంది పనితీరును పరిశీలించామన్నారు. నిబద్ధతతో విధులు నిర్వహించిన వారికి రివార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. స్టేషన్ పరిసరాలను, శుభ్రతను పరిశీలించి ఆలేరు ఎస్ఐ రజనీకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో సీఐ కొండల్‌రావు, ఎస్ఐ కె.రజనీకర్, హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది లావణ్య, మల్లిక, కిరణ్, రమేశ్, చంద్రశేఖర్, నవీన్‌కుమార్, బాలయ్య పాల్గొన్నారు.

'అభయ' కేసులో సత్వర న్యాయం చేయాలి

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న డాక్టర్లు, ఐఎఫ్‌టీయూ నాయకులు

ఆలేరు టౌన్, అక్టోబర్ 29 : డాక్టర్ అభయ కేసులో బాధిత కుటుంబానికి సీబీఐ సత్వర న్యాయం చేయాలని ప్రైవేట్ డాక్టర్లు సౌజన్య, సూర్యతేజ, ఐఎఫ్‌టీయూ నాయకులు జనార్దన్, నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అభయ కేసు విచారణలో జాప్యాన్ని నిరసిస్తూ ఆలేరులోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి మౌనం పాటించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ అభయ హత్య కేసు దర్యాప్తును రెండు నెలలుగా నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. ఖాళీ స్థలాల్లో రక్షణ కల్పించాల్సిన బాధ్యత అక్కడి ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పూజ, మలిపెద్ది భాస్కర్, మమత ఆసుపత్రి స్టాఫ్ పద్మ, నాగలక్ష్మి, రాణి, ఎం.రాధిక, సీహెచ్ వంశీ, సంజయ్, రేణుక, ఐఎఫ్‌టీయూ నాయకులు సహదేవ్, నర్సింహారెడ్డి, ఉదయ్, నరేశ్ పాల్గొన్నారు.

నవీన్‌కు బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు

అవార్డును స్వీకరిస్తున్న మోత్కుపల్లి నవీన్‌కుమార్

రాజాపేట, ఆగస్టు 29 : మండలంలోని పారుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్వీ నాయకుడు మోత్కుపల్లి నవీన్‌ను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు వరించింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన బహుజన సాహిత్య అకాడమీ 7వ రాష్ట్ర స్థాయి మహాసభలో సినీ గేయ రచయిత మానశ్రీ మల్లిక్, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత నవీన్‌కుమార్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడి జీవితం త్యాగం చేసిన అంబేద్కర్ తనకు స్ఫూర్తి అన్నారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు.

పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారుడిగా సూర్యనారాయణ

వర్కాల సూర్యనారాయణ

చౌటుప్పల్, అక్టోబర్ 29 : పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారుడిగా మండలంలోని కొయ్యలగూడెం గ్రామానికి చెందిన వర్కాల సూర్యనారాయణ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయనను నియమించారు. ప్రస్తుతం ఆయన శ్రీశైలం నిత్యాన్న దాన సత్రం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు సన్మానించారు. ఈనంతరం ఆయన మాట్లాడుతూ పద్మశాలీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి : సీపీఎం

ఆత్మకూరు(ఎం) : తుక్కాపురంలో కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 29 : మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోళ్లు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం అన్నారు. మండలంలోని తుక్కాపురం కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం రాశులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని రకాల వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లెల శ్రీశైలం, ఎరుకల స్వామిగౌడ్, కార్తీక్, మహేశ్, శ్యామల, శివ, భిక్షం పాల్గొన్నారు.

ఫోన్ కొనివ్వలేదని బాలుడి బలవన్మరణం

మహంకాళి శివ (ఫైల్)

రామన్నపేట, అక్టోబర్ 29 : తల్లిదండ్రులు స్మార్ట్ ఫోన్ కొనివ్వడం లేదని బాలుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని పల్లివాడ గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్లివాడ గ్రామానికి చెందిన మహంకాళి నర్సింహ్మ, లక్ష్మమ్మ దంపతులది నిరుపేద కుటుంబం. వారు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొడుకు శివ (15) ఆరు నెలల నుంచి వరికోత మిషన్‌పై హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. తనకు స్మార్ట్ ఫోన్ కొనియ్యాలని కొద్దిరోజులుగా తల్లిదండ్రులను కోరుతున్నాడు. ఈ విషయమై సోమవారం తల్లిదండ్రులతో వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపం చెందిన శివ తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఇనుప దూలానికి చీరెతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శివ తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

జై భీమ్ ఆటోడ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

భువనగిరి అర్బన్, అక్టోబర్ 29 : జై భీమ్ ఆటోడ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడు కర్తాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా కొత్త కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెలువర్తి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కొమ్ము జగదీశ్‌బాబు, సభ్యులుగా గుండు నర్సింగ్‌రావు, ఎస్‌కే జహంగీర్, మాటూరి నాగరాజు. మర్రి వినయ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు బండారి సుమన్, బాసాని నవీన్, నరేశ్, మధు, నగేష్, అనిల్, రమేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఇంటికి చేరిన తప్పించుకుపోయిన విద్యార్థి

యాదగిరిగుట్ట, అక్టోబర్ 29 : టీచర్ మందలించడంతో తప్పించుకుపోయిన వేద పాఠశాల విద్యార్థి తిరిగి ఇంటికి చేరాడు. ఈ సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కొనసాగుతున్న వేద పాఠశాలలో హైదరాబాద్‌లోని దమ్మాయిగూడేనికి చెందిన మనోజ్ సాయి విద్యనభ్యసిస్తున్నాడు. సోమవారం ఉదయం స్నానాలు చేసే సమయంలో విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు మనోజ్‌సాయిని మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన అతను పాఠశాల నుంచి తప్పించుకుపోయాడు. చుట్టుపక్కల వెతుకగా.. తన ఇంటికి చేరినట్లు తెలిసిందని వేద పాఠశాల ప్రిన్సిపాల్ జానకి తెలిపారు.